
బ్రతుకాట...
బండారు లక్ష్మి
CHANDRA

16—6—82

ఒళ్ళంతా వూగుతుంటే అందరూ కై పెక్కి—పిల్లాడి కడుపు నింపవలసిన తన గుండెను కళ్ళతో తాగేస్తుంటే — తను

"శే శే, నా రాజా — లేపమంటావా" అంటూ ఇక ఆలోచించలేదు చంద్ర. ఇంకో నిమిషంలో పాట అయిపోయి సత్తిరాజు లోపలికి వచ్చేస్తాడు. అతడి బెల్టు గుర్తుకొచ్చింది. సత్తిరాజు గ్రీన్ రూంలోకి వచ్చేటప్పటికి చంద్ర సూర్యచంద్రా లారీ కేబిన్ సీటు అడుగున నక్కి ఉంది.

'వెతకండి, వెతకండి' అని సత్తిరాజు హడావిడి చేసేటప్పటికి లారీ వూరు పొలిమేరలు వదిలేసింది.

చంద్రకి తెలివి వచ్చి చూసేటప్పటికి లారీ ఆగి ఉంది. సూర్యుడింకా పైకి రాలేదుగానీ, ఆకాశమంతా పబ్లిసిటీమాత్రం జరిగిపోయింది అతని రాక గురించి.

చంద్ర నెమ్మదిగా క్రిందికి దిగి చుట్టూ చూసింది. రోడ్డు ప్రక్కన పాక ఉంది. ప్రక్కనించి కాలవ వెళుతోంది. వరసగా లారీలు ఆగి ఉన్నాయి. డ్రైవర్లు కాలవలోకి దిగి మొహాలు కడుక్కుని ఆ పాకలో కెళ్ళి ఆకలి తీర్చుకుంటున్నారు. చంద్రకి ఒళ్ళంతా కుదుపు—జ్వరం వచ్చినట్టుగా ఉంది. పైటచెంగు ఒత్తుగా కప్పుకుని దొడ్డిదారిన పాకలోకి దూరింది. బయల్దేరే ముందు పిల్లాడికి పాలివ్వబోతుంటే "ఇయ్యాలింక పాలివ్వక" అంటూ చేతిలో పిల్లాడిని లాక్కొని ముసిల్దాని కిచ్చేసేడు సత్తిరాజు. గుక్కపట్టి ఏడుస్తున్న పిల్లాడి గొంతు ఎన్నేళ్ళయినా మరిచిపోలేక పోయింది చంద్ర. తీరికగా కూర్చుంటే తల్లిపాలతో పుష్టిగా ఉండి ఒడినిండిన బంగారుకొడుకు, తనను కొడుతుంటే హడలి పోయి జ్వరం పెట్టేసుకునే చిన్నారి కూతురు జ్ఞాపకం వచ్చి కళ్ళు వాచేలా ఏడ్చేది. ఒకసారి వెళ్ళి పిల్లల్ని తెచ్చేసుకుంటేనో! అమ్మో! కర్కోటక ముండాకొడుకు వదుల్తాడా!

హోటల్లో పారాటాబల్లలకు బదులు కుర్చీలూ, టేబిళ్ళూ వచ్చాయి. ఇడ్లీ, ఉప్మాకి సాయంగా పెసరట్టు, దోసె కేకలు. సింగిల్ టీ తో పాటు బ్రాందీ సీసా. మిలిటరీ భోజనం. మడత మంచాలు. ఏడేళ్ళ కాలం తీసుకొచ్చిన మార్పులు.

ముసలయ్యకు ఆదాయం పెరిగేటప్పటికి భక్తి కూడా పెరిగింది. వినాయక చవితికి గణపతిని నిలబెట్టి నవరాత్రులు జరపడానికి మనుష్యుల్నీ, డబ్బునీ కూడేసేడు. రికార్డులతోనూ, ప్రోగ్రాములతోనూ పందిరంతా సందడిగా ఉంది.

రాత్రికి రికార్డింగ్ డాన్స్. చంద్ర మనసు కవ్వం చిలుకుతున్నట్టుంది. "ఏమే, చంద్రమ్మా! సాంబారులో ఉప్పు లేదంట. ఇవ్వేళ నీ కూతురు గుర్తు కొచ్చిందేటమ్మా ఆలాగున్నావ్?" ముసలయ్యకు చంద్రమీద పాడిగేదెమీదున్నంత అభిమానం.

మధ్యాహ్నం రెండవుతుందనగా కోలాహలంగా దిగింది డాన్స్ గ్రూప్. హాలాహలంలా ఉన్న సత్తిరాజుని చూసి రాహువు మింగినట్టయిపోయింది చంద్ర. గదిలోనించి బయటికి రాలేదు. భోజనాలయ్యాక అందరూ భుక్తాయాసంతో శరీరాలు చేరేసేరు దొరికిన చోటల్లా. ఆడవాళ్ళు పెరట్లో




పందిరి క్రింద పడుకున్నారు. పెద్ద పెద్ద కళ్ళున్న ఆ పిల్లను చూస్తుంటే చంద్ర గుండెలో గేలం గుచ్చుకున్నట్టుంది. ఎగిసెగిసి పడుతున్న శకుంతల దగ్గర కూర్చొని తల నిమిరింది.

"ఏడిస్తే నీ కళ్ళు నీలాలు కారూ—పాలైన కారవే బంగారు కళ్ళూ" అంది చంద్ర. తన కళ్ళను తుడుచుకొనే ప్రయత్నం చెయ్యలేదు.

"అమ్మా!" చంద్రను చుట్టేసింది శకుంతల.

ఎదిగీ ఎదగని చంద్రవంకను గుండె కదుముకుంది చంద్ర.

"తమ్ము డేడమ్మా?" కన్నీళ్ళయిపోయాక అడిగింది.

"తమ్ముడా!" విస్తుపోయింది శకుంతల. నెమ్మదిగా జ్ఞాపకం తెచ్చుకుంది. ఆరోజు తమ్ముడూ, తనూ ఏడుస్తుంటే—అమ్మ ఏడుస్తూ నాన్నకూడా వెళ్ళిపోయింది. దెబ్బలు కొట్టి తీసుకుపోయాడు. తిరిగి ఒక్కడే వచ్చాడు. అమ్మని తీసుకురాలేదు వచ్చినదగ్గర్నుంచీ ఒకటే తాగుడు. జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అమ్మని బూతులు తిట్టేవాడు. పిల్లాడి పాలకు డబ్బు లడిగితే "ఇలా తీసుకురా—పీక పిసికి చెర్లో పడేస్తా" నన్నాడు. ఏడుపు భరించలేక ముసలమ్మ పిల్లా వరికో ఇచ్చేసింది పెంచుకోమని. తను కనబడితే చితకబాదేవాడు. ఎవరిని తీసుకొచ్చినా నాలుగు రోజుల కంటే ఎక్కువ ఉండలేక పోయేవారు. తనది మొండి ప్రాణం కాబట్టి ఎన్ని దెబ్బలు కొట్టినా చావకుండా ఇలా ఉంది.

శకుంతల వెక్కిళ్ళ మధ్య చెపుతూంటే రాయిలా వింది చంద్ర.

"ఎంత కష్టపడింది నా తల్లి!" చివికిపోతోంది చంద్ర మనసు.

"పోనీ, కొట్టినా ఫరవాలే దనుకో. ఇప్పుడు కొత్త పాఠం మొదలెట్టాడు. నువ్వు మోసం చేసి, డబ్బు సంపాదించకుండా వెళ్ళిపోయావట. ఆ డబ్బు నే నిప్పుడు సంపాదించాలంట. లేకపోతే ఎవరికైనా అమ్మేస్తాడట."

"పసి పిల్లను అగ్ని గుండంలో వదిలేసి వచ్చేసేను. పాపం!తన బదులుగా ఎన్ని కష్టాలు పడింది పిచ్చితల్లి!" అసలు ముసలయ్యను పంపించి పిల్లల్ని రప్పించుకోవలసింది. ఇప్పుడయినా ముసలయ్యతో చెప్పి... వూఁ... ముసలయ్యతో చెప్పి—ఇనుమును ఇనుమే వంచాలి.

మాట్లాడకుండా కూర్చున్న తల్లిని చూసి అంతవరకూ ఉన్న ఆశకూడా పోయినట్లు నిరాశపడిపోయి నీరస పడిపోయింది శకుంతల.

"నే నిలా బ్రతకలేనమ్మా. నేను లేకపోతే మాత్రం ఏం పోయింది? నా గురించి మళ్ళీ నువ్వు బాధల్లోకి రాకు. ఇక్కడే ఉండు." శకు మాటల్లో నిష్ఠురం ధ్వనించింది.

చంద్ర ఆ పిల్ల వైపు తేరి చూసి నిస్తేజంగా నవ్వింది.

"శకూ! ఇంతవరకూ నే న్నీకోసం ఏమీ చెయ్యలేదు. ప్రేమ లేక కాదు, తల్లీ. అవకాశం రాలేదు. నీకేం జరిగినా నేను పోయిన తరవాతే. అదిమాత్రం జ్ఞాపకం ఉంచుకో" అనుకుంది మనసులో.

రాత్రయింది.

"పిల్ల డేన్సెయ్యదు." ఖచ్చితంగా చెప్పింది చంద్ర.

"పోనీ నువ్వే ఎయ్యి. నువ్వూ పడునుగానే ఉన్నావ్!" వెకిలిగా అన్నాడు సత్తిరాజు.

"నువ్వు మామ్మ దగ్గర కూర్చో, శకూ." పంపేసింది కూతుర్ని.

ఆరగంటయ్యాక డేన్స్ మొదలయింది.

"ఆదోని దొరసాని వరసమ్మనీ

ఆలిండియాకు చాలెంజినీ, హాలిండియాకు చాలెంజినీ..." రంగు పూసుకుని గెంతుతూంది చంద్ర.

గులాబీరంగు జాకెట్టు—నల్లరంగు చీర బిగించి కట్టింది. ఆమె నాట్యం పురుష ప్రపంచాన్ని చాలెంజి చేస్తున్నట్టుగా ఉంది. అంతకంటే ధాటీగా వేద్దామనుకుంటున్న సత్తిరాజుకి అడుగులు సరిగా పడడం లేదు.

రోడ్డుమీద తన మీద నుంచి జోరుగా పోతున్న లారీయే కనబడుతోంది. ఆడియన్స్‌లో ఉన్న లారీ డ్రైవర్లందరూ తన పాలిటి యమదూతల్లా కనిపిస్తున్నారు ఆతనికి.

"పిల్లనిగాని, తల్లినిగాని తీసుకెళ్ళడానికి ప్రయత్నించే వంటే రోడ్డుమీద ఏక్సిడెంటయి పోతావ్!" ముసలయ్య బెదిరింపు చెవుల్లో గియ్ మంటున్నది.

"బెంగుళూరు బేబిని ..."

తన కూతురి కిక భయం లేదు. పాటకంటే చంద్ర ఆట మరీ హుషారుగా ఉంది.

ప్రేక్షకులు ఆనందాన్ని పట్టలేకుండా ఉన్నారు. ఈలలూ, చప్పట్లూ — రోడ్ మీద పోతున్న కారులు కూడా ఆగిపోతున్నాయ్.

మామ్మదగ్గిర కూర్చున్న శకుంతలమాత్రం కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తోంది, తనకు బదులుగా ఆడుతున్న తల్లిని చూడలేక. *